తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

కల్వకుర్తి టౌన్: పుట్టినబిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని కల్వకుర్తి సీడీపీఓ వెంకటమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొని తల్లులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో చాలా మంది తల్లులు వారి పాలను మానేసి, డబ్బా పాలను వారి పుట్టిన పిల్లలకు పట్టిస్తున్నారని గుర్తుచేశారు. ఇలా పట్టించటంతో పిల్లలలో రోగనిరోధక శక్తి తగ్గి తరచూ రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, వెంకట్, అంగన్వాడీ టీచర్, హెల్పర్లు పాల్గొన్నారు.


చందాపూర్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ దమయంతి

బల్మూర్: తల్లిపాలే శిశువు ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి సూచించారు. పుట్టిన వెంటనే గంటలోపు శిశువుకు తల్లిపాలను తప్పనిసరి తాపించాలన్నారు. బల్మూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

తల్లిపాలతో పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి..

వెల్దండ: పిల్లలకు తల్లిపాలతో వ్యాధినిరోధక శక్తి వస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీమతి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చెదురుపల్లిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.

తెలకపల్లి: పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సంగీత అన్నారు. మండల పరిధిలోని పెద్దూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

ముర్రుపాలు తాగించాలి..

అచ్చంపేట రూరల్: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి పథకం కింద అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అచ్చంపేట సీడీపీఓ దమయంతి సూచించారు. బుధవారం మండలంలోని చందాపూర్, బుద్ధతండా, పులిజాల, అచ్చంపేటలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కమల, రాజేంద్ర, రాధిక పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక అంబేద్కర్ కాలనీలోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.


వెల్దండలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీమతి


కల్వకుర్తిలో సూచనలు చేస్తున్న సీడీపీఓ వెంకటమ్మ


మన్ననూర్‌లో తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తున్న సూపర్‌వైజర్ సువర్ణ

గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయం


చెన్నారంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బాలరాజు

అచ్చంపేట రూరల్: దేశంలోనే తెలంగాణ పల్లెలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం మండలంలోని చెన్నారంలో రూ.30 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. నాయకులు పరమేష్, కాశయ్య, సాయికుమార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణాలకు భూమి పూజ..

ఉప్పునుంతల: మండలంలోని గువ్వలోనిపల్లిలో బుధవారం శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు భూమి పూజ చేశారు. ఆయా ఆలయాల నిర్మాణాలకు రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తున్న తనను గ్రామస్తులు ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ రాఘవులు, శివుడు, నర్సింహ, సుల్తాన్, హన్మంతు, సైదులు, రేణయ్య తదితరులు పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం


అశోక్‌కుమార్

బల్మూర్: మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కాగితాల అశోక్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. ఈయనకు డాక్టర్ మనీష్ కుమార్ సింగ్ మార్గ నిర్దేశంలో 'ఏ రీసెర్చ్ఆస్ ఎ క్రిటికల్ స్టడీ అఫ్ మాథమెటికల్ ఫార్ములేషన్ ఫర్ రియల్ అనాలసిస్ ఆస్ పార్సియల్ ఫంక్షన్స్' అనే పరిశోధనకు గాను రాజస్థాన్‌లోని సన్ రైజ్ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రం తెలిపారు. ఆయనను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం



తాడూరు: మండలంలోని చర్ల ఇటిక్యాలకి చెందిన విద్యార్థిని వైష్ణవి విదేశాల్లో చదువుకోవడానికి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా రూ.20 లక్షలను ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మంజూరు చేయించారు. ఆ చెక్కును బుధవారం విద్యార్థిని తల్లిదండ్రులకు అందించారు. పేదింటి బిడ్డ చదువులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం వరం లాంటిదని బాగా చదువుకుని లక్ష్యం నెరవేరేలా కృషి చేయాలని అన్నారు.

సమాన వాటా కోసం పోరాటం

కల్వకుర్తి రూరల్: మేమెంతో మాకంత వాటా దక్కాల్సిందే.. సామాజిక న్యాయం, సమాన వాటా కోసం పోరాడుదామని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఈ నెల 7న తిరుపతిలో నిర్వహించే ఓబీసీ మహాసభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో బీసీలకు విద్యారంగంలో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లే అప్పటి ప్రధాని వీపీ సింగ్ ప్రకటించిన రోజైన ఆగస్టు 7న బీసీ మండల్ డేగా వ్యవహరిస్తున్నామన్నారు. సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారని చెప్పారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు, దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్, శివప్రసాద్, రాంసాగర్, రాకేష్, రాజు, రమేష్ పాల్గొన్నారు.


పోస్టర్ విడుదల చేస్తున్న మహేష్ యాదవ్

అభివృద్ధి పనులపై సమీక్ష

చారకొండ: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యాదర్శులు, ఉపాధి అధికారులు, వ్యవసాయ అధికారులతో ఎంపీడీఓ జయసుధ సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులపై, మొక్కల నాటుడంపై సమీక్షించారు.

క్రీడా ప్రాంగణాలు పూర్తి చేయాలి..

గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని సిర్సనగండ్ల, శాంతిగూడెం, రామచంద్రాపురం, గైరాన్ తండాలో బుధవారం ఎంపీడీఓ జయసుధ గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులు పరిశీలించారు.

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటయ్య


నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

వెల్దండ: మండల పరిధిలోని చెర్కూర్‌కి చెందిన నూకం వెంకటయ్యముదిరాజ్‌ను ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ బుధవారం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌ముదిరాజ్ హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో నియామక పత్రం అందజేశారు. ముదిరాజ్ కులస్తుల హక్కులను సాధించుకోవాలన్నారు. మత్స్యసంపదను పెంపొందించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ముదిరాజ్ కులస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యక్షుడిగా మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, కార్యదర్శిగా వెంకటయ్య, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎర్రవోలు మహేష్‌లకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నియామక పత్రాలు అందజేశారు. గుండ్లపల్లి శ్రీనివాస్, బల్ల సత్తయ్య, మందుల వరలక్ష్మి, జగన్, గంగమోని కిరణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ తెలంగాణ ముదిరాజ్ మహాసభ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాతం వెంకటేష్, కార్యదర్శిగా సందు యాదగిరి ఎంపిక కాగా.. సభ్యులుగా మరికొంత మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మల్లికార్జున్, అల్లోజి, సహదేవుడు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై చర్య తీసుకోవాలి

కోడేరు: ఎస్‌ఐ శేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి, తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము, బచ్చలకూర బాలరాజు హాజరై మాట్లాడారు. కోడేరు మండలం మైలారానికి చెందిన దళిత సర్పంచ్ మశన్నపై ఎస్‌ఐ చెయ్యి చేసుకోవడం దుర్మార్గమన్నారు. సోమనాథ్, కృష్ణయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

బీసీలను సీఎం చేయడమే ప్రజాపార్టీ లక్ష్యం


కొల్లాపూర్: బీసీలను సీఎం చేయడమే ప్రజాపార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని మాదవస్వామి దేవాలయ ఆవరణలో ప్రజాపార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో 70 మంది బీసీలకు ప్రజాపార్టీ అసెంబ్లీ టికెట్లు ఇస్తుందన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో బహుజనులు ఎమ్మెల్యే కావాల్సిన అవసరం ఉందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్‌యాదవ్

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బల్మూర్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఐక్యమత్యంతో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని గోదల్‌లో బుధవారం బల్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు గ్రామాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు తొమ్మిదేళ్లలో నెరవేర్చలేదన్నారు.

ఉపాధ్యాయులకు తొలిమెట్టు శిక్షణ


మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ గోవర్ధన్‌రెడ్డి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి ఉపాధ్యాయులకు తొలిమెట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్లంలో చదవడం రాయడంతో పాటు గణితంలో చతుర్విధ ప్రక్రియలకు సంబంధించిన లెక్కలు చేసేలా చూడాలన్నారు. ఒక్కో సబ్జెక్టులో రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. జీహెచ్ఎంలు జె. శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని తరగతి గదిలో విద్యార్థులకు అమలు చేసి సామర్థ్యాన్ని పెంచాలని ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి తిరుపతయ్య అన్నారు. శిక్షణ కార్యక్రమం రెండో రోజు బుధవారం మండలంలోని సిర్సవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రాములు గౌడ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం తొలిమెట్టుపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్పీలుగా సంజీవి, గోపాల్, శోభన్‌బాబు, శ్రీకాంత్ విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధన అంశాలను వివరించారు.

ఎమ్మెల్యేకు వినతి

కల్వకుర్తి: డివిజన్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కలిశారు. కల్వకుర్తి పట్టణంలో ఫొటో, వీడియో గ్రాఫర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి అందజేశారు. డివిజన్ పరిధిలోని ఫొటోగ్రాఫర్లకు కలుగుతున్న ఇబ్బందులు పరిష్కరించాలని డివిజన్ అధ్యక్షుడు రంగినేని రవికుమార్ ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే ప్రక్రియను ప్రారంభిస్తానని హామీ ఇచ్చినట్లు రవికుమార్ చెప్పారు. వెంకట్, మొయిన్‌ఖాన్, ఖాజ, పరుషోత్తం పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్‌తోనే వరి విత్తుకోవాలి

బిజినేపల్లి: రైతులు వరిసాగులో నారు పద్ధతి కాకుండా నేరుగా విత్తనం నాటే పద్ధతి ఎంచుకోవాలని, అందుకోసం రైతులు డ్రమ్ సీడర్‌తో విత్తుకోవాలని తిమ్మాజీపేట మండల వ్యవసాయాధికారి కమల్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని మరికల్‌లో డ్రమ్ సీడర్‌తో 8 ఎకరాల్లో పొలంలో రాజేందర్‌రెడ్డి రైతు వరిని విత్తుకున్నాడు.

తెలకపల్లి: డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిసాగు చేసే రైతులకు అవగాహన కల్పించారు.

పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల, గంట్రావుపల్లి గ్రామాల్లో డ్రమ్‌సీడర్‌తో వరి విత్తనాలను వెదజల్లే పద్ధతిని ఏఈఓలు జానకిరాం, అనిల్ రైతులకు వివరించి వరి విత్తనాలు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనాలు వెదజల్లుకోవాలని సూచించారు. కూలీల ఖర్చు తగ్గుతుందని, ఈ పద్ధతి ద్వార విత్తుకున్న విత్తనాలు పంట 15 రోజులు ముందుగానే కోతకు వస్తుందన్నారు. కార్యక్రమంలో రవీందర్, సుధాకర్‌రావు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.


పెద్దకార్పాములలో డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు వేస్తున్న రైతులు

తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి..

చారకొండ: పత్తి పంటకు ఎర్రగా, వరి నారు తెల్లగా మారి పంట చనిపోతుంది. దీని నివారణకు త్వరగా చర్యలు చేపట్టాలని చారకొండ ఏఓ చిన్న హుస్సేన్ అన్నారు. మండలంలోని గోకారంలో బుధవారం పంటపొలాల్లో ఏఓ చిన్న హుస్సేన్, ఏఈఓతో కలిసి పంటలను పరిశీలించారు. పంటలకు ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వారివెంట ఏఈఓ రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

షీ టీంపై విద్యార్థినులకు అవగాహన

ఉప్పునుంతల: కస్తూర్బా గాంధీ విద్యాలయం(కేజీబీవీ)లో బుధవారం షీం టీంపై అచ్చంపేట సబ్‌డివిజన్ షీ టీం బృందం అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులకు గురవుతున్న బాలికలు ధైర్యంగా షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి పేర్లు గోప్యంగా ఉంచడంతో పాటు సమస్యను పరిష్కరిస్తామన్నారు. మహిళల భద్రత, సైబర్ సేఫ్టీ మరియు సెక్యూరిటీ, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో కలిగే అనార్థాలను విద్యార్థులకు వివరించారు. అత్యవసర సమయాల్లో 100, 1098, 1930 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో షీ టీం అచ్చంపేట ఇన్‌చార్జ్ హెడ్‌కానిస్టేబుల్ పద్మ, కానిస్టేబుల్ వెంకట్‌నాయక్, భానుప్రకాష్ రెడ్డి, వెంకట్‌రాం తదితరులు పాల్గొన్నారు.


ఉప్పునుంతల కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కొల్లాపూర్‌లోని ఆర్టీసీ డిపోలో కార్మికులను కలిశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్మికులతో కలిసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనాలు చేశారు.

చెక్కుల పంపిణీ..

నియోజకవర్గంలోని కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి మండలాలకు చెందిన 135 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

అమ్మ ఒడి వాహనం ప్రారంభం..

కొల్లాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో అమ్మ ఒడి వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుక ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భోజ్యానాయక్, సుమిత్రమ్మ, కిషన్ నాయక్, సోమనాథ్‌నాయక్, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చారకొండ: మండలంలోని సారంబండ తండాలో రూ.15 లక్షలతో బుధవారం సర్పంచ్ రాజు నాయక్ సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. గ్రామంలో ఇప్పటికే రూ.60 లక్షలతో సీసీరోడ్లు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సహకారంతో నిధులు మంజూరయ్యాయన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కొల్లాపూర్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి సమరభేరి సైకిల్ యాత్ర బుధవారం కొల్లాపూర్ నుంచి ప్రారంభమైంది. యాత్రను రజినీకాంత్ ప్రారంభించారు.శివవర్మ, సయ్యద్, తారాసింగ్, కార్తీక్, రామకృష్ణ పాల్గొన్నారు.

కంది మొలకలు తొలగించిన దుండగులు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోలుకి చెందిన కుమ్మరి లక్ష్మయ్య కొన్ని రోజుల కిందట దాదాపు 2 ఎకరాల మేర కంది పంట వేశాడు. అవి ప్రస్తుతం మొలకలు వచ్చి పెరుగుతున్నారు. అదే గ్రామానికి చెందిన తమ కులస్తుడు బాలస్వామి చిన్న కంది మొలకలను ధ్వంసం చేశాడు. మాకు నష్టం కలిగించిన అతనిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

అచ్చంపేట రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమం నిర్వహించారు. 3, 9, 18 వార్డుల నుంచి ప్రజలు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించిందని, ప్రస్తుత వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. వెంటనే స్పందించిన చైర్మన్ రెండు రోజుల్లో ఆయా కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. కమిషనర్ శ్రీహరిరాజు, అనిత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని జిల్లెల్లా, యంగంపల్లి గ్రామాల్లోని అభివృద్ధి పనులను బుధవారం ఎంపీడీఓ ఆంజనేయులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లెల్లలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న పోషక పదార్థాల వివరాలు, రికార్డులను పరిశీలించారు.

బీజేపీ నాయకుల నిరసన

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటంలో వెలిసిన శ్రీలక్ష్మి నరసింహ స్వామికి హుండీ ఆదాయం రూ.లక్షల్లో వస్తున్నా.. ఆలయ చైర్మన్ ఆదిత్య లక్ష్మణ్‌రావు, ఈఓ రంగారావు దేవాలయాన్ని అభివృద్ధి చేయడం లేదని బుధవారం హుండీ లెక్కిస్తుండగా.. లెక్కింపును అడ్డుకోవడానికి బీజేపీ మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ప్రయత్నించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, ఈఓతో వాగ్వాదానికి దిగారు. అందుకు స్పందించిన ఈఓ రంగారావు, వచ్చే ఏడాది ఆలయానికి అన్ని వసతులు కల్పిస్తామన్నారు. స్వామి వారి హుండీ ఆదాయాన్ని సద్వినియోగం చేస్తామన్నారు.

ఆధ్యాత్మిక చింతనలో ఉండాలి

తెలకపల్లి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనలో ఉండాలని ఓంకార అచల పీఠ శాఖ ఆశ్రమం పీఠాధిపతులు శ్రీరాంమడుగు గురుబ్రహ్మేంద్రస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆశ్రమం 9వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. రామాచారి, శ్రీనివాసాచారి, రామన్‌గౌడ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై నిర్లక్ష్యం తగదు

బిజినేపల్లి: సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా దరఖాస్తుదారుడికి నిబంధనల ప్రకారం ఇవ్వాలని, సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పెద్దతండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పాత్లావత్ రవినాయక్ మే 7న గ్రామ పంచాయతీకి సంబంధించిన పలు అంశాలపై సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసి, సమాచారం ఆలస్యంపై ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చాడు. ఈ సమాచారం అందివ్వడంలో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శి సురేష్‌ను ఎంపీడీఓ హెచ్చరించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

పెద్దకొత్తపల్లి/ తాడూరు/ఊర్కొండ/చారకొండ: నక్కలపల్లిలో మండల పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు రోగనిరోధక టీకాలు, లంపీస్కిన్, నట్టల నివారణ మందులను పంపిణీ చేసినట్లు డాక్టర్ మధు తెలియజేశారు. 318 పశువులు, 136 గేదెలకు టీకాలు వేసినట్లు చెప్పారు. డాక్టర్ అశ్విని, శైలజ, వెంకటేష్, కర్ణాకర్ రెడ్డి, వేమారెడ్డి, సలీం, యాదగిరి పాల్గొన్నారు.


హక్కుల సాధనకు పంచాయతీ కార్మికులు బుధవారం బోనాలతో నిరసన వ్యక్తం చేసి, అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేశారు.

– 'సాక్షి' నెట్‌వర్క్

క్లుప్తంగా

ఉద్యాన పంటలకు ఆఖరి అవకాశం

బిజినేపల్లి: గ్రామాలో ఐదు ఎకరాల్లోపు వ్యవసాయ భూమి కలిగిన రైతులు సబ్సిడీలో ఉద్యాన పంటల సాగు కోసం ఆగస్టు 4 వరకు దరఖాస్తు చేసుకోవాలని, అందుకు కావాల్సిన పత్రాలు ఆ గ్రామ కార్యదర్శికి ఇవ్వాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. బుధవారం డీఆర్‌డీఓ నర్సింగరావుతో ఎంపీడీఓ కాన్ఫరెన్స్ కాల్‌లో మండలంలోని ఉద్యాన పంటల సాగుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను వివరించారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ గడువు పొడగింపు

కొల్లాపూర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాల కోసం అడ్మిషన్ గడువు ఈ నెల 16వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు యాదవ్ వెల్లడించారు. మొదటి సంవత్సరంలో అడ్మిషన్ కోసం విద్యార్థులు ఆన్‌లైన్ లేదా కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం, తృతీయ సంవత్సరం విద్యార్థులు కూడా ఆన్‌లైన్‌లో అడ్మిషన్ ఫీజులు చెల్లించాలని సూచించారు.

5న సామాజిక తనిఖీ ప్రజా వేదిక

అమ్రాబాద్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 5న సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామ్మోహన్ తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా జనవరి ఒకటో తేదీ నుంచి మార్చి 31, 2023 సంవత్సరం వరకు నిర్వహించిన పనులపై మండలంలోని ఇరవై గ్రామపంచాయతీల్లో నిర్వహించిన పనులు, ఖర్చుపై సామాజిక తనిఖీ బృందం పరిశీలించిన అంశాలను ఈ ప్రజావేదికలో వివరిస్తారని చెప్పారు. ఉదయం పది గంటలకు ప్రజావేదిక ఉంటుందని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉపాధిహామీ పథకం లబ్ధిదారులు హాజరుకావాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఊర్కొండ: ఊర్కొండపేట సర్పంచ్ నాగోజీ మాతృమూర్తి భారతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని భారతమ్మ పార్థివ దేహానికి నివాళి అర్పించి, సర్పంచ్ నాగోజీని ఓదార్చారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

చారకొండ: ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని అచ్చంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోపతయ్య అన్నారు. బుధవారం ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రంలో దెబ్బతిన్న మట్టి ఇళ్లను పరిశీలించారు. మట్టి ఇళ్లు ధ్వంసమైన నిరాశ్రయులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో చందూరి శ్రీను, కాశన్న, అంజయ్య, కృష్ణయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం హర్షణీయం

కల్వకుర్తి రూరల్: సీఎం కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ.. నిర్ణయం తీసుకోవడం హరణీయమని మాజీ ఆర్టీసీ ఉద్యోగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగాధర్, జూపల్లి బాలస్వామి, లక్ష్మయ్య గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీ నష్టాల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వంలో విలీనం చేయడం గొప్ప నిర్ణయమన్నారు. సీఎం నిర్ణయాన్ని కొంత మంది ప్రతిపక్ష నాయకులు ప్రజలు తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం సరికాదన్నారు.

ఇంటి సామగ్రి పంపిణీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని పంజుగులలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో నిర్మిస్తున్న ఇంటికి బుధవారం ఇంటి సామగ్రి అందజేశారు. గ్రామానికి చెందిన నర్సమ్మ ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. తన గోడును గ్రామానికి చెందిన గణేష్ ద్వార ఉప్పల వెంకటేష్‌కు వివరించడంతో సహకారాన్ని అందిస్తామని చెప్పి హామీ ఇచ్చి ఆ హామీ ప్రకారం అసంపూర్తి ఇంటి నిర్మాణానికి సిమెంట్ బ్యాగులను అందజేశారు.

స్కూల్ స్వీపర్ల నిరసన

నాగర్‌కర్నూల్‌రూరల్: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ స్వీపర్లు బుధవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 160 మంది రూ.1,623 అతితక్కువ వేతనంతో బతుకుబండి లాగిస్తున్నారని అన్నారు. యాదగిరి గౌడ్, అర్జున్, వెంకటయ్య గౌడ్, మహ్మద్ అలీ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా ఉండాలి

వెల్దండ: గౌడకులస్తులు సంఘటింతగా ఉండి ముందుకు సాగినప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటయ్యగౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కమిటీని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నాగరాజుగౌడ్, మదన్‌గౌడ్ పాల్గొన్నారు.